కథ

# ఎవరితో లేచిపోను?..

## కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

సావిత్రీ-

నీ ఉత్తరం చదివిన దగ్గర్నుంచీ చెప్పుకోలేని అపరాధ భావనతో కుమిలిపోతున్నాను. నువ్వు నా ఎదుట నిలబడి నిష్కర్షగా నా అవివేకాన్ని, అసమర్ధతని, వేలెత్తి చూపుతూ 'ఆక్యుపంచర్'లా నర నరాన్ని తూట్లు పొడుస్తున్నట్లుంది.

ముగింపులో నీ సూటి ప్రశ్న, తోకమీద పాములా నా ముందు నిల్చుంది. మళ్ళీ అంతలోనే భయం, బేలతనం నన్ను పాతాళంలో కూచోబెడుతున్నాయి.

నలుపు-తెలుపు చిత్రంలా, నీ ఉత్తరాల్లోంచి గతంలోని వెలుగు నీడలన్నీ మనసులో మెదిలాయి. నేను గ్రాడ్యుయేట్ నవటం. నాన్న ఆనందం చూసి నేను సంతోషపడటం, ఉద్యోగం వచ్చిన ఆనందం ఇంకిపోయేలా ఇంటి బాధ్యతలు! బాధ్యతలు పట్టించుకోని పెద్దకొడుగ్గా - అన్నయ్యప్రవర్తన. నాన్నగారు శాశ్వతంగా వీడ్కోలు పలికి వెళ్ళి పోవడం. అటు తర్వాత అంతా జీవన నాటకమే! బి.ఇడి ప్యాసయ్యాక మున్సిపల్ గరల్స్ స్కూలులో సైన్స్ అసిస్టెంట్ ఉద్యోగం నా ఆర్థికస్థితిని కొద్దిగా మెరుగుపరిచింది గానీ, నాజీవితంలో సంతోషాన్ని నింపలేక పోయింది. ఇద్దరుచెల్లెళ్ళు, తమ్ముడి బాధ్యతలు, వాళ్ళ భవిష్యత్తుకోసం నేను పడిన పాట్లు,మానసిక వేదనలు నన్ను కంటినిండా నిద్రకు దూరం చేశాయి. నాకంటే నాలుగేళ్ళు చిన్నదానివైనా, గృహిణిగా నాకంటే పెద్దదానివి. సకాలంలో పెళ్ళయి, పండంటి పిల్లాడితో 'గృహమేగా స్వర్గసీమ' అన్నట్లు, అనురాగం వర్షించే అర్ధనారీశ్వరుడైన, నీ ప్రాణేశ్వరుడితో, హాయిగా బతికేస్తున్నావు. నేనీ మాటలు అసూయతో రాయటంలేదు. నీకు అభినందన పూర్వకంగానే రాస్తున్నాను. ఇలాంటి ఆనందమయ జీవితం ఎంతపుణ్యం చేసుకుంటే నీకు దక్కిందో -

"ఆడదై పుట్టేకంటే అడవిలో మ్రానై పుట్టడం మంచి"దంటారు మధ్యతరగతి కుటుంబంలో ఆడదై పుట్టేకంటే ఘోర నరకం మరోటి ఉండదు. ఆదేమి శాపమొ,మధ్యతరగతి తండ్రులు అధిక సంతానం- అందులోను ఆడపిల్లల్ని అధికంగా కంటారు.వాళ్ళకి చదువులు సరిగా చెప్పించలేరు. సకాలంలో పెళ్ళిళ్లు చెయ్యలేరు. కన్నవారిమీద మమకారం ఉన్న నాలాంటి ఆడపిల్లశిలువమీద క్రీస్తులా కాళ్ళకి, చేతులకి మేకులు దిగ్గొట్టించుకుని, పెళ్ళీ పెటాకులూ లేక చివరికి దిక్కులేని చావు చావటంతో కథ ముగిసిపోతుంది.

నువ్వుకూడా అక్కడక్కడా ఈ మాదిరి జీవితాలు చూస్తూనే ఉంటావు. ఆడపిల్లకి సకాలంలో పెళ్ళిళ్ళు చెయ్యకపోవటం అటుంచి, ఏ బట్టల దుకాణంలోనో రెండొందలకో మూడొందలకో 'సేల్స్‌గర్ల్'గా జేర్పిస్తారు. రోజంతా వాళ్ళు నిలువు కాళ్ళమీద నిలబడాల్సిందే. కూచోటానికుండదు. కళ్ళు తిరుగుతున్నాసరే అటూ ఇటూ తిరగొచ్చు తప్ప, స్టూలుమీదో కుర్చీమీదో కూచో కూడదు.ఎంత దారుణం! మానవత్వం ఇంతగా కుళ్ళి పోయిందా?! మా ఇంటి పక్క నే ఉన్నార్లే ముగ్గురు అప్పచెల్లెళ్ళు. తండ్రి చిన్నగుమాస్తా. పదో తరగతితో చదువులు మాన్పించి, బట్టల కొట్లలో 'సేల్స్ గరల్స్' గా చేర్పించారు. నేనిప్పుడు రాసింది వాళ్ళ అవస్థే.

ఏం రాశావునువ్వు?

ఎవడితో నన్నా లేచిపోరాదూ-అనేగా నీప్రశ్న. ఇదుగో... పైన చెప్పిన ముగ్గురు అప్పచెల్లెళ్ళలో - పెద్దపిల్ల కులాంతర, మతాంతర ంగా ఎవరితోనో లేచిపోయింది.

మూడ్నెల్లదాకా పత్తాలేదు.ఆ తండ్రి మొహంలో నాకు ఎలాంటి విచారమూ కన్పించలేదు. కనీసం పోలీసు కంప్లయింటు కూడా ఇవ్వలేదు. పీడ విరగడైందనుకుంటుండగా చిరిగి పోయిన విస్తరిలా ఆ పిల్ల ఇంటికొచ్చింది.

ఆ రోజు పెద్ద రాద్ధాంతం.

ఆపిల్లను బయటే ఉంచి,తండ్రి తలుపులు వేసేసు కున్నాడు. మర్నాడు ఉదయం ఆపిల్లలేదు. ఆతర్వాత తెల్సింది, ఆ అమ్మాయి ఆత్మ హ త్య చేసుకుందని! అది కూడా ఘోరంగా... రైలు కింద పడి... తునాతునకలై...

ఆ దృశ్యం ఊహించుకోగలవా?

చెప్పు సావిత్రీ...

ఇలాంటివి ఎన్ని జరగటం లేదు?

అలాగని అన్నీ అలాగే జరుగుతాయా? - అని నువ్వు రెట్టిస్తావు. కాక పోవచ్చు. కానీ, కళ్లముందు జరిగినదాన్నెలా మర్చి పోగల్ను.

యుద్ధంలో ముందుకు వెళ్ళే వాళ్ళలో ఎందరు తిరిగి వస్తారో ఎవరు చెప్పగలరు? తూటాలు తగల కుండా ఎవరు యుద్ధం చేయగలరు? జీవితంకూడా అంతే అన్పిస్తుంది నాకు. లేచిపోయిన వాళ్ళంతా చెడిపోలేదన్నావు. నిజమే కావచ్చు.అలాగని అంతా బావున్నారని కూడా అనుకోలేం.

'వీలయినంత త్వరలో ఎవర్నయినా పెళ్ళి చేసుకో'మన్నావు. ఒకసీరియస్ విషయం నీకు రాయక తప్పదు. ఈ మధ్య మాస్కూల్లోకి ఒక ఇంగ్లీషు టీచరు బదిలీమీద వచ్చాడు. మనిషి బానే ఉంటాడు. వసపిట్టలా వాగుతాడు. ఇంగ్లీషు కవుల రచనల గురించి బోలెడు విషయాలు చెబుతాడు. ఎందుకనో తెలీదు,కాస్త ఎక్కువగా నాతో చనువు చూపసాగాడు. నేను చూసీ చూడనట్టు గమనిస్తుండిపోయాను. ఒక రోజున ఏకాంతంలో 'మీ కభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను' అనేశాడు. మొదట 'షాక్' తిన్నా తర్వాత నీ సలహా గుర్తొచ్చి ఆలోచిస్తాను' అన్నాను.

ఆ తర్వాత అతని గురించి ఆరాలు తీశాను.

అతనికప్పటికే పెళ్లయి ఇద్దరు పిల్లలు. భార్య కూడా టీచరేట!

ఇలా ఉన్నారుమనుషుల్లో తోడేళ్ళు.

మరో 'కేసు' గురించి కూడా నీకు రాయాలి.

'కేసు' అంటున్నానేమిటనుకోకు. నామనసుకి లాంటివన్నీ 'కేసు' లుగానే కనిపిస్తాయి.

ఒక ఇన్స్యూరెన్సు ఉద్యోగికి భార్యపోయింది.ఒక మగపిల్లవాడు. రెండో పెళ్ళి కోసం అతని మిత్రులు ప్రయత్నిస్తూ నన్ను కలుసుకున్నారు.

తిట్ట నంటే చెబుతా... అతనికి తాగుడు, వ్యభిచారం లాంటి అలవాట్లున్నాయట!– ఇలా అందరికీ 'ఇంటూ'లు పెట్టటం ఏమీ బాగో లేదని నువ్వు తిడతావని నాభయం. చూస్తూ చూస్తూ అలాంటి వాణ్ణి ఎలా చేసుకోమంటావు చెప్పు.

సావిత్రీ–

ఇంకొక్క 'కేసు'చెప్పి ఉత్తరం ముగిస్తా.

నాకంటే ఐదేళ్లు చిన్నవాడు.ఎదురింట్లో అద్దెకు దిగాడు. ఏదో ప్రైవేటు కంపెనీలో మేనేజరు. కలుపు గోలుగా ఉంటాడు.మొన్న శ్రీరామనవమినాడు మా ఇంటికొచ్చి 'మీరు పూజచేస్తే నాకు ప్రసాదం పెట్టండి.నాపేరు శ్రీరామచంద్రమూర్తి.ఆరాముడే మీఇంటి కొచ్చాడనుకోండి" అంటూ చేతులు జాచాడు. వెంటనే ప్రసాదం, పానకం ఇచ్చాను.

జానకిగారూ! ఈ పుస్తకం చదవండి"ఈపుస్తకం చదవండి'అంటూ చేతిలో పుస్తకం ఉంచి వెళ్ళాడు.

చూద్దునుకదా–లోపల ప్రేమలేఖ!

నాగుండెలు దడ దడలాడాయి. జీవితంలో మొదటి ప్రేమలేఖ. వణుకుతున్న చేతుల్తో చదివేను. నయం. నేనా ఉత్తరం చదవటం ఎవరూ చూశారు కాదు.

సారాంశం చెప్పేస్తా.

"రాముడికన్నా జానకి పెద్దది .ఇద్దరూ ఆదర్శ దంపతులైనారు. మీ కిష్టమైతే మనం కూడా కావొచ్చు.మీ అంగీకారం చెప్పండి" అనిరాశాడే!

వెంటనే నువ్వుగుర్తొచ్చావు.

"వీలైనంత తొందరలో ఎవర్నైనా పెళ్లి చేసుకో, ముందు నువ్వు సుఖపడు. తృప్తిపడు. తర్వాత ఎవరిసంగతైనా ఆలోచించవచ్చు.నీకు పెళ్లి వయసు దాటి పోయిందంటే నేను నమ్మను. మరొక పద్ధతుంది. పెళ్లయిన వాళ్లందరూ బాగుపడనూలేదు. లేచిపోయిన వాళ్లందరూ చెడిపోనూలేదు. ఏమంటావ్?"

– ఇదీ నీ ఉత్తరంలో ఆఖరిపేరా!

– మళ్లీ మళ్లీ నేను చదువుకుంటున్న 'స్నేహ సందేశం'

సావిత్రీ– ఇప్పుడు నేనొక అయోమయంలో పడి కొట్టుకుపోతున్నాను. అతన్తో నా పెళ్లి సాధ్యమేనా?పెద్దలు అంగీకరిస్తారా?

లేని పక్షంలో నేను అతన్తో లేచిపోవాలా?

ఏం చెయ్యమంటావు?

నీ ఉత్తరం కోసం నిరీక్షిస్తూ–

నీ ప్రియాతి ప్రియమైన

**జానకి**

# మాట

## చిన్ని నారాయణరావు

కడివెడు
కష్టాల్నీ
కన్నీటి చారికల్నీ
ఒక్కసారిగా చెరిపివేసేది
ఆశల చిగుళ్ళు పంటలై తొడిగేది
అమ్మ చూపులు చిలికే పలుకులతోనే కదా
అమ్మ పలికే పలుకుల దీవెనలతోనే కదా
ఎడారిలో సైతం దాహార్తిని తీర్చే
మంత్రాక్షరాలవి.
మరుభూమిని అమృతవర్షిణిగా
తలపింపజేసే జ్ఞానసంపదలవి
ఒక్క అమ్మమాటకే ఆమహోన్నత శక్తి ఉంది
అమ్మకే మనపై అంతటి ఆసక్తి ఉంటుంది
అమ్మకే మనపై ఆవేదన అంతర్లీనమై
ప్రవహిస్తుంది
ఆశేతుక్మానియై ఆమె అంతరంగం
ప్రతిధ్వనిస్తుంది.
పుట్టగానే
అమ్మమాటతోనే కదా
మనకు పొద్దుపొడిచేది
శరీరాన్ని మనసునీ నేత్రంచేసి
ప్రపంచంలోని ప్రేమనంతా రంగరించి
మాటలు కథలుగా మనకు చెబుతుంది
కబుర్లు కవితలు చేసి మనకందిస్తుంది
ఆ మాటలు బంగరు బాటలై
భావికి చక్కని పునాదులవుతాయి
అమ్మ మాటలే మనలోకి జలపాతవేగంతో
ప్రవహించి అత్యంత వేగాన్ని పుట్టిస్తాయి
నిట్టూర్పులోనుంచి... నిరాసక్తతలోనుంచి
ఉద్వేగాన్ని చెప్పలేని ఉద్రేకాన్ని నింపుతాయి
ఆమె మాటేకదా మనకు
బ్రతుకంతా తోడుగా నీడగా నిలుస్తుంది
అమ్మ ఆశీస్సుల భరోసాతోనే కదా
ఈ లోకాన్ని జయించడానికి
పెనుసవాళ్ళను ఎదురీదడానికి
కావలసిన ధైర్యాన్ని ప్రోది చేసుకొనేది
బుడి బుడి నడకల నాడు నడకనేర్పితే
అమ్మమాట పట్టుగొమ్మగా పట్టుకొనేగా
నడత నేర్చేది
ఆమె మాటల బుల్లెట్లు గ్రుచ్చుకొని
ఆ ప్రభావమేగా మనల్ని ఈ సమాజంలో
ఎంతేని నడిపించేది
అమ్మమాటలు అలలై ఒడ్డును తాకినట్టు
మన హృదయ సంద్రాన్ని తాకుతాయి
అవి ముప్పిరిగొని మనసునే
నిట్టనిలువునా ఛేదిస్తాయి.
జిజియా మాటల చురకత్తులేకదా
వీరశివాజీగా వినుతికెక్కిన
ఛత్రపతిలో... ఉగ్గుపాలతో
ధైర్యస్థైర్యాల పోతపోసింది.
అమ్మమాటతోనే కదా
శ్రీరామచంద్రుడు మాటతప్పని
వ్యక్తిత్వ వైశిష్ట్యానికి ప్రతీకగా
లోకానికి ఆదర్శప్రాయంగా
నిలిచింది.
యశోదమ్మ మాటలతోనేకదా
శ్రీకృష్ణుడు భగవద్గీతకు
బాటలు వేసుకొంది.
ఎంతోమంది తల్లుల ధృడసంకల్పాలు
వెదజల్లిన భావజాలాలే కదా
శత్రుదుర్భేద్యంగా... రక్షణ కవచంగా
వీరజవాన్లను సృష్టించి
ఈ దేశానికి అందించింది.
అమ్మమాటలో మార్గనిర్దేశకత్వం దాగుంది
అమ్మమాటతో బ్రతుకును పండించుకొనే
సామర్థ్యం నిలువెల్లా పెల్లుబుకుతుంది.
ఎంతమంది తల్లుల మాటలు
దడికట్టాయోకదా...
మహోన్నత ప్రాజెక్టుల ప్రదాతలుగా
మన ఇంజనీర్లు సాక్షాత్కరించింది.
మరెంతోమంది అమ్మలమాటలు
గుడికడ్డేనే కదా తమ తనయులు
ధన్వంతరులై.... అపరబ్రహ్మలై
మనిషికి ప్రాణం పోస్తున్నది
ఏ కడుపు తీపి ప్రతిఫలించిన మాటలే కదా
తమ పాదముద్రలే నమ్మకానికి ప్రతిబింబాలుగా
మిగిల్చిన అడిటర్లను రూపొందించేది
అమ్మమాటలో విద్యుత్తంతటి
సామర్థ్యం దాగుంది
అమ్మమాటలో విద్వత్తంతా
దాగి ఉంటుంది
మనిషికి జవం జీవం అయి
నిత్యం నడిపిస్తూనే ఉంటుంది
మాటతీరు బాగుంటే
లోకం గిర్రున తిరుగును నీవెంటే
మాటతీరు వికసిస్తే
ప్రపంచమే హరితమౌను ముమ్మాటికీ నిజమంతే!